
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శుక్రవారం 15 ఆగస్టు 2025

గరిష్ఠం 29.5
కనిష్ఠం 21.4

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.803)	1,72,774	2,37,056
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.50 (3.84)	6,612	10,098
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.011 (38.360)	2,71,900	1,81,334

చికెన్ ధరలు: లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



అలా కానిచ్చేశారు!

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గొర్రెల స్కాం బయట పడిన వెంటనే దానికి ఆజ్యం పోసింది ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనే విషయం గతంలో చర్చనీయాంశమైంది. ఓ ద్విచక్ర వాహనంపై 200 గొర్రెలు, ఒక ఆటోలో 1,320 గొర్రెలను తరలించినట్లు రికార్డుల్లో నమోదు చేయడాన్ని కాగ్ వెలుగులోకి తెచ్చింది. అక్రమాల నేపథ్యంలో దీనికి సంబంధించిన రూ.18కోట్ల బిల్లుల చెల్లింపులను అధికారులు నిలిపివేశారు.అయితే తాజాగా అసలు అక్రమాలే లేవంటూ ఇటీవల జిల్లా అధికారులు రూ.6కోట్ల బిల్లులు చెల్లించడం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

గొర్రెల యూనిట్ల కొనుగోలు సందర్భంగా వాటిని తరలించేందుకు అధికారులు కనీసం వాహనాల నెంబర్లు ఏమిటనేది కూడా చూడకుండా అత్యుత్సాహం ప్రదర్శించారు. గుర్తు తెలియని వాహనాల నెంబర్లతో ఇన్‌వాయిస్‌లు రూపొందించి గొర్రెలను తీసుకవచ్చినట్లు నివేదిక ఇచ్చి అక్రమార్కులు ఏసీబీకి, ఈడీ, కాగ్‌కు అవలీలగా చిక్కారు. దీంతో సుమారు రూ.18 కోట్ల వరకు బిల్లులు నిలిపివేస్తూ అప్పట్లో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సుమారు రెండు ఏళ్ల వరకు బిల్లులను పెండింగ్‌లో పెట్టిన అధికారులు రెండు నెలల క్రితం అందులో రూ.6కోట్లను రిలీజ్ చేశారు. అంతా పశుసంపద ఉన్న రైతులేనని, సరైన డాక్యుమెంట్లు ఉన్నాయని బిల్లులు చెల్లించామని పశు సంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నిబంధనల మేరకు ఒక రైతు నుంచి 10 నుంచి 12 యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. ఒక్కో రైతు నుంచి 270 గొర్రెలు సేకరించవచ్చు. కానీ అధికారులు, రైతుల నుంచి గాక దళారుల నుంచి పెద్దమొత్తంలో గొర్రెల యూనిట్లు కొనుగోలు చేశారు.

- » గతంలో బిల్లులు చెల్లింపును తిరస్కరించిన ఓ సీనియర్ అధికారి
- » కేసు చల్లబడిందనే ఆలోచనతో చెల్లించిన యంత్రాంగం
- » అక్రమాలు జరిగాయని ఈడీకి సైతం నివేదికలు
- » బిల్లులపై గోప్యత పాటిస్తున్న పశుసంవర్ధకశాఖ

బిల్లులను తిరస్కరించిన అధికారి

గొర్రెల కొనుగోలులో కొందరు అధికారులు, డాక్టర్లు దళారులతో కుమ్మకై అక్రమాలకు పాల్పడినట్లు గతంలో విమర్శలు వచ్చాయి. అధిక మొత్తంలో గొర్రెల యూనిట్లను ఉమ్మడి నల్లగొండ జిల్లాకు విక్రయించిన దళారులు, ఆ బిల్లులను తీసుకోవడం కోసం పశుసంవర్ధకశాఖకు బిల్లులను పెట్టి విశ్వ ప్రయత్నం చేశారు. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పశుసంవర్ధక శాఖలో పనిచేసిన ఓ సీనియర్ అధికారి ఈ బిల్లుల చెల్లింపును తిరస్కరించారు. దీంతో ఉన్నతాధికారుల వద్ద సుమారు 15నెలల వరకు ఈఫైల్ పెండింగ్‌లో ఉంది. ఈ ఫైల్‌ను కదిలిస్తే తమ మెడకు చుట్టుకుంటుందని భావించిన అధికారులు దాన్ని పక్కన పెట్టారు. అయితే రెండు నెలల క్రితం ఏ విధంగా బిల్లులు చెల్లించారనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. సంబంధిత శాఖలోనే ఈ అక్రమాలపై గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏ లెక్కన బిల్లులు ఇచ్చారు? ఎంత మందికి ఇచ్చారు? ఆ డాకుమెంట్లు సరియైనవేనా? అని పరిశీలన చేయలేదని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజులుగా రాష్ట్రంలో గొర్రెల స్కాంపై పెద్ద సందడి లేదు. దీంతో కేసు చల్లబడిందన్న ఆలోచనతోనే దళారులకు బిల్లులు చెల్లించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 10రోజుల క్రితం అనూహ్యంగా రాష్ట్ర...

- మిగతా 8వ పేజీలో...

డాక్యుమెంట్లు చూసి బిల్లులు చెల్లించాం

డాక్యుమెంట్లను పూర్తిగా పరిశీలించిన తరువాత అవి సరియైనవని భావించి బిల్లులు చెల్లించాం. ఇంకా ఎంత పెండింగ్‌లో ఉందనేది మా వద్ద సమాచారం లేదు. అయితే ఇంకా బిల్లులు పొందాల్సిన వారు 100మంది వరకు ఉండి ఉండవచ్చు. రెండు నెలల క్రితం రూ.6కోట్ల వరకు చెల్లించాం. జిల్లాలో గొర్రెల కొనుగోళ్ల విషయంలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోలేదని భావించినందునే బిల్లులు చెల్లించాం.

- డాక్టర్ రమేష్, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ

● స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబు



స్వాతంత్ర్య దినోత్సవానికి జిల్లా ముస్తాబైంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, వాడవాడలా జాతీయ పతాకాలను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పదవీ కాలం మరో ఆరు నెలలు



పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల గడువు పెంపు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం


భారీగా సమకూరనున్న నిధులు

7

నేటి నుంచి వార్షిక టోల్ పాస్

● రూ.3వేల రీచార్జీతో ఏడాదికి 200 ట్రిప్పులు

7



ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఊహా చిత్రం

విద్యార్థుల ఇక్కట్లు తప్పినట్లే

పాఠశాల ఎదుట ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యం అత్యంత రద్దీగా ఉండే దేవరకొండ రోడ్డులో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (పాదచారుల వంతెన) నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. నేషనల్ హైవే నిధుల ద్వారా రూ.5కోట్లతో ఈ పాదచారుల వంతెనతో పాటు లిఫ్టును, ఎలివేటర్‌ను నిర్మించనున్నారు. దేవరకొండ రోడ్డులోని సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ ఎదుట ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు లిఫ్టు ఎలివేటర్ నిర్మాణం వల్ల నల్లగొండ పట్టణానికి తలమానికం కానుంది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రమంత్రి నితీష్ గడ్కరీ కలిసి నిధులు మంజూరు కోసం కృషి చేశారు. రద్దీ అధికంగా ఉండటం వల్ల రోడ్డు దాటే విద్యార్థులకు, పాదచారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నల్లగొండ పట్టణంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నల్లగొండ పట్టణంలోని సిద్ధార్థ కాలనీ, మరియామాత టెంపుల్, బిషప్ హౌజ్, అబ్బాసియా కాలనీలకు వెళ్లడం కోసం రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణ పనులకు శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉదయం 11.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి వెంకట్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజీ



విద్యుత్‌శాఖ సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజీ, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ డైరెక్టర్ శివాజీ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో వర్షాలు, పిడుగులు పడి విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజులు, కనెక్షన్ లైన్లు ముందుగానే మరమ్మతులు నిర్వహించాలన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని అన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు స్పందించాలన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజీతో కలిసి మైనంపల్లి వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యుత్‌శాఖ సీజీఎం బిక్షపతి, ఆర్డీవో రమణారెడ్డి, డీటీ కృష్ణరావు, డీఈ విద్యాసాగర్, ఏడీ సైదులు, సాగర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్

చిట్యాలరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డెంగీ జ్వరంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు. చిట్యాల మండలం ఏపూర్‌లో డెంగీ జ్వరం వచ్చిన బాలుడి నివాసాన్ని గురువారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్, వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, ఎంపీడీవో జయలక్ష్మి, వైద్యబృదం పరిశీలించారు. గ్రామంలో 50 ఇళ్లల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి ప్రదీప్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో జ్వరం వస్తుందని జ్వరం మూడు రోజులు దాటితే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అధిక జ్వరం,తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, అలసట, వికారం, వాంతులు, చర్మంపై దద్దుర్లు లక్షణాలు ఉంటే డెంగీ లక్షణాలుగా గుర్తించాలని, వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. ఇంట్లో, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఏపూర్‌లో డెంగీ వచ్చిన బాలుడి కోలుకొని ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేశబోయిన లిం గస్వామి, తాటికొండ లింగస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భారీ వర్షాలపై మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో అనుకున్న దానికంటే ఎక్కువ వర్షం కురిసిందని, ఈ నెల 15న కొన్ని జిల్లాల్లో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ న్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవాలని, ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ నుంచి కనిష్ఠ స్థాయిలో నీటిని విడుదల చేయాలని సూచించారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేస్తే కా ల్వ తెగిపోయేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నీటి నియంత్రణ చేయాలని ఆయన తెలిపారు. వర్షం వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి నిధుల కొరతలేదని, ప్రతి జిల్లాకు కోటి రూపాయలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా వర్షాల వల్ల రోడ్లు, విద్యుత్ వంటి వాటికి అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించాలన్నారు. అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణరావు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో వర్షాల కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అన్నారు. మూసీ ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తిన నీటిని కిందికి వదులుతున్నట్లు తెలిపారు. ప్రభావిత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వర్షాలపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏవైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ ఫోన్‌నెంబర్ 18004251442 కు తెలియజేయాలని కోరారు. వర్షాలు కురుస్తున్నందున రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడ తాగునీటి పైప్ లైన్ లీకేజీ వంటివి ఏర్పడకుండా చూడాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి 24గంటలు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రత్యేక అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



వాడపల్లి చెక్‌పోస్టును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాల అమలులో మండల ప్రత్యేక అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్ట ర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువా రం మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక అధికారులు మండలాల్లో గుర్తించిన సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తరచూ మండలాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సవ్యం గా అమలు చేసేందుకు కృషి చేయాలని అన్నా రు. యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని జిల్లా రైతులకు మాత్రమే యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితు ల్లో బయటికి పోకుండా చూడాలని సూచించారు. అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లాను మరింత అభివృద్ధి పరిచే విధంగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

దామరచర్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతూ మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వెంటనే చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలను ప్రతీ గురువారం వైద్యాధికారి తప్పనిసరిగా సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ వాడపల్లి చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చే సి మాట్లాడారు. చెక్‌పోస్టు మీదుగా పీడీఎస్ బియ్యం, ఇసుక, యూరియా అక్రమంగా బయటకు వెళ్లకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టుల్లో పటిష్ఠ నిఘా పెట్టాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మండలంలోని ఇర్కిగూడెం వద్ద కృష్ణా నది ప్రవాహాన్ని పరిశీలించారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇర్కిగూడెం ఘాట్ వద్ద చేపలు పట్టేందుకు మత్స్యకారులు లోపలికి వెళ్లవద్దని సూచించారు.

'యూరియా' కోటా తీసుకురావడంలో విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం)

నల్లగొండ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను తగ్గించిందని, రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆ పార్టీకి చెందిన 8 మంది ఎంపీలు యూరియా తీసుకురావడంలో విఫలమయ్యారని సీపీ ఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని మగ్దూం భవనంలో గురువారం నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల కురుస్తున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరిగిందని అన్నారు. రైతులకు యూరియా అందుబాటులో లేకుండా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. బ్లాక్‌లో యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారస్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 20 నుండి 22వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సత్యం పిలుపు నిచ్చారు. దేశంలో సీపీఐ వందేళ్ల ప్రస్థానంతో కార్మి కులు, కర్షకులు, అణగారిన వర్గాల ప్రజల కోసం అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. దేశంలో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పాలకులు అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఆర్.అంజనాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యు లు పబ్బు వీరస్వామి, గురిజ రామచంద్రం, పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

నల్లగొండరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ల అమలుపై ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదని, ఉంటే ఈ పాటికి అమలయ్యేదని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తాము పోరాడుతూనే ఉన్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాయకులు అర్థం, పర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. 10శాతం ముస్లింలకు రిజర్వేషన్ తీసేయాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం సవరణ చేసి బిల్లును ఆమోదించవచ్చని అన్నారు. పార్టీ పరంగా బీసీలకు భిక్ష వేయడం కాదు చట్టబద్ధంగా హక్కు కల్పించాలని తెలిపారు. లేనిచో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేర్లకంటి కాశయ్య, కేశబోయిన శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, వాడపల్లి సాయిబాబా, లింగంగౌడ్, మధు యాదవ్, శంకర్‌గౌడ్, సైదులుగౌడ్, పవన్‌సాయి పాల్గొన్నారు.


● చిత్తడి రహదారిపై నాట్లేసి



జిల్లా కేంద్రంలో రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్న నల్లగొండ-ముషంపల్లికి రహదారి వర్షాలతో చిత్తడిగా మారడంతో సీపీఎం నాయకులు గురువారం ఇలా నాట్లేసి నిరసన తెలిపారు.

8

ప్రత్యేక సాగు అరుదైన గౌరవం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొందరు రైతులు ప్రత్యేక పంటలు సాగుచేసి గుర్తింపు పొందుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ పంటలు సాగుచేసి లాభాలు గడిస్తున్నారు. ఆ కోవకే వస్తారు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన తెలుకుంట్ల రాంమూర్తి. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే పదెకరాల్లో సుమారు ఐదేళ్లుగా కలబంద సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మ విభాగం ఆహ్వానం మేరకు ఈ నెల 15న ఢిల్లీలో జరుగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు రాంమూర్తి-శైలజ దంపతులు ఢిల్లీ వెళ్లారు.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

- పదెకరాల్లో కలబంద సాగు చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లావాసి
- ఆర్‌సీఎఫ్‌సీ సిఫారస్సుతో కేంద్ర ఆయుష్మ విభాగం ప్రత్యేక ఆహ్వానం
- ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం

పాటిమట్ల గ్రామానికి చెందిన తెలుకుంట్ల రాంమూర్తి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసముంటారు. ఆయనకు పాటిమట్లలో తల్లిదండ్రులు సంపాదించిన వ్యవసాయ భూమి ఉంది. సాధారణ పంటలు సాగు చేస్తే తాను ఎప్పటి కప్పుడు వెళ్లి చూడలేనని(పర్యవేక్షణ చేయలేనని), ఏపంట వేస్తే బాగుంటుందని స్నేహితులతో చర్చించారు. ఓ స్నేహితుడి సలహాతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఓ రైతు సాగు చేస్తున్న కలబంద(అలోవేరా) సాగును చూసి వచ్చారు. పశువులు, కోతుల బెడద ఉండకపోవడంతో పాటు అడవి జాతి మొక్క అయినందున తెగుళ్లు సోకవని తెలుసుకొని పదెకరాల్లో ఐదేళ్లుగా కలబంద సాగు చేస్తున్నారు. సాగుకు అనుకూలంగా భూమి చదును చేసి, మొక్కలు నాటడానికి ఎకరాకు సుమారు రూ.50వేలు ఖర్చు అయిందని రాంమూర్తి తెలిపారు. ఎకరాకు 5వేల నుంచి 6వేల మొక్కలు నాటుతారు. కలబంద మొక్క నాటిన నాటి నుంచి ఒక సంవత్సరానికి కోతకు వస్తుంది. ఒక్కసారి నాటిన మొక్క ఐదేళ్లు ఉంటుంది. ఐదేళ్ల తర్వాత దానిని తొలగించి మళ్లీ నాటుకోవాలి. కలబంద పంటకు డ్రిప్ ఏర్పాటు చేశారు. ఎరువులు వేయాల్సిన అవసరం పెద్దగా ఉండదు. పనులన్నీ కూలీలు, యంత్రాలతో చేయించడంతో కలబంద సాగు నిర్వహణకు ఏడాదికి ఎకరాకు సుమారు రూ.50 వేల ఖర్చు వస్తుందని ఆయన తెలిపారు. ఏడాదికి ఎకరాకు సుమారు 15టన్నుల దిగుబడి వస్తుందని, సుమారు రూ.1.60 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్షపైగా మిగులుతాయని, ఎర్రనేలలు కలబంద సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు.

ఎస్‌ఎంపీబీ సిపారసుతో...

కలబంద సాగుచేస్తున్న రాంమూర్తి తెలంగాణ రాష్ట్ర ఔషధ మొక్కల(మెడిసినల్‌ప్లాంట్లు) బోర్డులో నమోదై ఉన్నారు. ఎస్‌ఎంపీబీతో పాటు రీజినల్ కం ఫెసిలిటేషన్ సెంటర్(ఆర్‌సీఎఫ్‌సీ) సిఫారస్సుతో కేంద్ర ప్రభుత్వ ఆయుష్మ విభాగం రాంమూర్తి-శైలజ దంపతులను ఢిల్లీ జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానించింది. 16వ తేదీ వరకు అక్కడే ఉండడానికి కేంద్ర ప్రభుత్వం వసతి కల్పిస్తుంది.


కలబంద పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి



కలబంద సాగు లాభదాయకంగానే ఉన్నప్పటికీ మార్కెట్ సౌకర్యం తక్కువ. ఎక్కడ విక్రయించాలో తెలియక రైతులు ఎక్కువగా సాగు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలబందకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. మార్కెట్ సౌకర్యం ఉంటే సాగు పెరుగుతుంది. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, గుజ్జు తీసే యంత్రం లాంటివి సబ్సిడీపై అందించాలి.

- తెలుకుంట్ల రాంమూర్తి, రైతు.

బేగంపేట.. మీ దేశభక్తికి సలాం



బేగంపేటలో ఎగురుతున్న జాతీయ పతాకం

- గ్రామంలో 78 ఏళ్లుగా మువ్వన్నెల జెండా రెపరెపలు
- జాతీయ పతాకంపై గౌరవం.. అమితమైన ప్రేమ గ్రామస్థుల సొంతం
- జాతీయ పతాక ఆవిష్కరణ అంటే వారికి పండుగే

రాజాపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామస్థులకు జాతీయ పతాకంపై అమితమైన గౌరవం, ప్రేమ. స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు 1947 ఆగస్టు ఆర్ధరాత్రి నుంచే ఆ గ్రామంలో జాతీయ పతాకం ఎగిరింది. అప్పటినుంచి గ్రామంలో మువ్వన్నెల జెండా నిర్వీరామంగా రెపరెపలాడుతోంది. ఎనిమిది దశాబ్ధాలుగా గ్రామస్థులు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. బేగంపేట గ్రామం మొదటి నుంచీ విప్లవోద్యమాలకు కేంద్రం. నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా రగుల్ జెండా ఎగురవేసిన ఘనత వారిది. బ్రిటిష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే గ్రామానికి చెందిన బద్దం నర్సిరెడ్డి, పిట్ట రాంచంద్రారెడ్డి, చిగుర్ల మల్లయ్య, బలిజ రాజవీరయ్య కలిసి గ్రామ చావడిలో జాతీయ పతాకం ఎగురవేశారు. మూడు రంగుల జెండాను బోగ హనుమంతు తన మగ్గంపై స్వయంగా నేచి రంగులు అద్దారు. దర్జీ బొంతయ్య పతాకంపై ధర్మ చక్రాన్ని కుట్టారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26వ తేదీల్లో, దసరా పండుగ రోజు కూడా జాతీయ పతాకాన్ని మారుస్తుంటారు. జాతీయ పతాక ఆవిష్కరణను గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో పండుగలా జరుపుకుంటారు. నిరంతరాయంగా ఎగురుతున్న జాతీయ పతాకాన్ని చూసి గర్వంగా సెల్యూట్ చేస్తారు. ఆగస్టు 15వ తేదీన 79వ సారి గ్రామస్థులు సగౌరవంగా పతాకాన్ని ఎగురవేయనున్నారు.

జాతీయ పతాకాన్ని అందరం గౌరవిస్తాం



మా గ్రామంలో జాతీయ పతాకం నిరంతరంగా ఎగురుతోంది. జాతీ పతాకాన్ని అందరం గౌరవిస్తాం. కలసికట్టుగా పండుగలా జరుపుకుంటాం. అనవాయితీగా పతాకాన్ని ఎగురవేస్తున్నాం.

- భిక్షపతి, సింగిల్‌విండో డైరెక్టర్, బేగంపేట.

మాకు గర్వంగా ఉంది



మా గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేయడం ఎంతో గర్వంగా ఉంది, స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే జెండాను ఎగురవేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా ఎగురుతూనే ఉంది. ఏడాదిలో మూడుసార్లు జెండాను మారుస్తాం,

- బోగ రుషి, మాజీ సర్పంచ్, బేగంపేట.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని సూరేపల్లిలో అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. సూరేపల్లి గ్రామానికి చెందిన కేశవపట్నం రమణయ్యపై ఈ నెల 12వ తేదీన భూ తగాదాల విషయంలో దాడి జరిగింది. భువనగిరి మండలంలోని పచ్చర్లబోడుతండాకుచెందిన గుగులోతు నర్సింహ సూరేపల్లి గ్రామానికి చెందిన రమణయ్యపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సింహపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాధ(29)ను నమాత్‌పల్లి గ్రామానికి చెందిన పడిగెల వెంకటేశ్ ప్రేమించి రెండో పెళ్లిచేసుకున్నాడు. కాగా రాధ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో రాధ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. తమ ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామానికి చెందిన మీనాక్షి బుధవారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది మీనాక్షిని మల్కాపురం నుంచి చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ వినయ్‌కుమార్, పైలెట్ చిన్నస్వామి ప్రసవం చేశారు. మీనాక్షి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యంకోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కోదాడ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కాపుగల్లుశివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎస్పీ కాల్వలో కంపచెట్లకు మృతదేహం అడ్డుపడిఉండి, కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహంపై తెల్లని చొక్కా, నల్లని లోయర్ ఉంది. గ్రామ కార్యదర్శి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బొడ్రాయి పండుగకు వెళ్లి వస్తూ..

గుర్రంపోడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బొడ్రాయి పండుగకు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గుర్రంపోడు మండలంలోని తుర్కపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం... అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందిన గణపతి వెంకన్న(42) గుర్రంపోడు మండలంలోని మక్కపల్లి గ్రామంలో గురువారం జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు బంధువుల ఇంటికి వెళ్లాడు. బైక్‌పై తిరిగి గ్రామానికి వస్తుండగా తుర్కపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గేదె రోడ్డుకు అడ్డంగా రావడంతో ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



భువనగిరిలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అర్జునయ్య

భువనగిరి టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అపరిచితులతో మహిళలు జాగ్రత్తగా ఉండాలని యాదాద్రిభువనగిరి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ అర్జునయ్య అన్నారు. పలుఅంశాలపై భువనగిరి బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణాలు, బస్టాండ్, మార్కెట్ తదితర బహిరంగ ప్రదేశాలలో గుర్తుతెలియని స్త్రీ, పురుషులు ఎవరైనా మాట్లాడించే ప్రయత్నాలకు, ఆహార పదార్థాలు, ప్రలోభాలకు గురి కావద్దన్నారు. ఒంటరిగా మహిళలు అధిక మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు, తీసుకు వెళ్లవద్దని సూచించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు వస్తే తలుపు తీయవద్దని, ఫేక్ ఫోన్ కాల్స్ ఎత్తవద్దని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అండాలు, కృష్ణ, ఏఎస్ఐ రాములు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌చారి, కానిస్టేబుల్స్ తురుపతమ్మ, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్, ఇసుక ట్రాక్టర్ పట్టివేత


కనగల్, ఆగస్టు 14:(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బోయినపల్లి గ్రామ వాగులో అనుమతి లేకుండా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను(జేసీబీ), ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న మరో ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సదరు వాహన డ్రైవర్లతోపాటు యజమానులపై కేసు నమోదు చేశారు. కనగల్ వాగుబ్రిడ్జి, బోయినపల్లి వాగుబ్రిడ్జి వద్ద ఇరు వైపులా 500ల మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేదం ఉందని తెలిపారు. ఇసుక రీచ్‌ల్లో అధికారులు సూచించిన ప్రదేశంలోనే ఇసుకను ఎత్తుకోవాలని సాండ్‌టాక్సీ వాహనదారులకు సూచించారు. బ్రిడ్జికి సమీపంలో ఇసుక తవ్వకాల కారణంగా అవి కూలిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



విద్యుత్ దీపాలతో ముస్తాబైన నల్లగొండ మునిసిపల్ కార్యాలయం




నల్లగొండలో సిద్ధమవుతున్న శకటం



నల్లగొండలో ముస్తాబైన అంబేడ్కర్ సర్కిల్

జెండా పండుగకు ముస్తాబు

స్వాతంత్ర్య దినోత్సవానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. కలెక్టరేట్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలెక్టరేట్ ప్రాంగణాల్లో ఉదయం 8.30గంటలకు అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో సిద్ధమవుతున్న వేదిక



నల్లగొండలో...



నల్లగొండలో విద్యుదీపాలతో సుభాష్‌చంద్రబోస్ సెంటర్



నల్లగొండలో పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు



భువనగిరిలో సిద్ధమవుతున్న వేదిక



భువనగిరిలో అతిథుల కోసం సిద్ధమైన కుర్చీలు

'పేట' చోరీ ఘటనలో అరకిలో బంగారం స్వాధీనం?

● సూర్యాపేట నగల దుకాణం చోరీ కేసులో పురోగతి ● పక్కా సమాచారంతో కోల్‌కతాకు పోలీసులు ● ముఠా సభ్యుల్లో ఒకరి అరెస్టు



బంగారు ఆభరణాల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ(ఫైల్)

సూర్యాపేట క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్డులో గల శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసులో సూర్యాపేట జిల్లా పోలీసులు అర కిలో బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గత నెల 20వ తేదీ అర్ధరాత్రి నేపాల్, జార్ఖండ్‌కు చెందిన వ్యక్తులు నగల దుకాణంలో చోరీకి పాల్పడి సుమారు మూడు కిలోల బంగారు ఆభరణాలు, సుమారు రూ.20లక్షల నగదును అపహరించారు. దుకాణ యజమాని తెడ్ల కిశోర్ ఫిర్యాదుతో పట్టణ పోలీసులకు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఖమ్మం జిల్లాకేంద్రంలో నివాసంఉంటే ఓ మహిళకు చోరీ ఘటనకు సంబంధించి ముందస్తు సమాచారం ఉండడం, చోరీకి పాల్పడిన నేపాల్‌కు చెందిన ప్రధాన నిందితుడితో కొన్నినెలలుగా పరిచయం ఉందని గుర్తించిన సూర్యాపేట పోలీసులు ఇటీవల ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీకి పాల్పడిన నిందితుడు సూర్యాపేట నుంచి పారిపోయే క్రమంలో ఖమ్మంలో ఉంటున్న ఆ మహిళకు ఆభరణాలు ఇచ్చి వెళ్లటంతో సుమారు 14తులాల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

మహిళ ఇచ్చిన సమాచారంతో..

సదరు మహిళ ఇచ్చిన సమాచారంతో పది రోజుల క్రితం కోల్‌కతా వెళ్లిన సూర్యాపేట జిల్లా పోలీసులు ముఠా సభ్యుల్లో ఒకడిని అదుపులోకి తీసుకుని సుమారు అర కిలో బంగారు అభరణాలతో పాటు కొంత మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో మిగిలిన నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని నల్లగొండ-1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న 10మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కే. శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ అదేశాల మేరకు నల్లగొండ-1టౌన్ పరిధిలో రెండు చోట్ల గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో, నల్లగొండ-1టౌన్ ఎస్ఐ జె.గోపాల్‌రావు తన సిబ్బందితో కలిసి మునుగోడు మునుగోడు రోడ్డులో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న ఆరుగురు యువకులను పట్టుకున్నారు. అదేవిధంగా నల్లగొండ-1టౌన్ ఎస్ఐ సతీష్‌తో తన సిబ్బందితో కలిసి మిర్యాలగూడ రోడ్డులో గల జూబ్లీ హిల్స్ కాలనీ సమీపంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 30వేలు విలువ చేసే 1.65 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని సేవిస్తున్న ఆరుగురు యువకులను రిహాబిటేషన్ సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. గంజాయి సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భగవాన్‌సింగ్ ఆశయాలు సాధించాలి

సూర్యాపేటరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి గిరిజనుడు లోనవత్ భగవాన్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేయాలని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రాంచందర్‌నాయక్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని రాజనాయక్‌తండాలో గిరిజనుల నాయకులు దివంగత భగవాన్‌సింగ్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీలకతీతంగా నియోజకవర్గ ప్రజలను గౌరవించేవారని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కరించేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వూర రాంమూర్తి యాదవ్, పెద్దిరెడ్డి రాజా, డాక్టర్లు సునీల్., గిరిదర్, రాజానాయక్, శాంతాబాయి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటి స్పీకర్ రాంచందర్‌నాయక్

తాటిచెట్టు పైనుంచిపడి గీతకార్మికుడు మృతి



శ్రీను(ఫైల్)

శాలిగౌరారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారింగుల శ్రీను(45) రోజు మాదిరిగానే కల్లు గీయడానికి గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కాడు. కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. ఇరుగుపొరుగు వారు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో నకిరేకల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. శ్రీనుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

దొంగ ఓట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ

నల్లగొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నల్లగొండ కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు దొంగ ఓట్లపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ఎన్జీ కళాశాల వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ దొంగ ఓట్లతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. ఒక్క అడ్రస్ తో వందలాదిమందికి ఓటు హక్కు కల్పించి ఓటు వేయించారని ఆరోపించారు. దొంగ ఓట్లన్నీ బిజెపి నాయకులే నమోదు చేయించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, గాజుల సుకన్య, భాగ్య, సురెడ్డి సరస్వతి , ఎగ్గడి సుజాత, షేక్ జాను, జక్కలి లలిత, బొడ్డుపల్లి జానకి, సదాలక్ష్మీ, మీరా ఉన్నారు.

మువ్వన్నెల పతాక రెపరెపలు



దేశభక్తి పెంపొందించేలా.. సమైక్యత భావం ఉప్పొంగేలా.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వందడుగుల (30 మీటర్లు) జాతీయ జెండా ఏర్పాటు చే శారు పాలకులు. నేను-నా మిర్యాలగూడ నినాదంతో, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవతో ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండా ను 2024లో నిర్వహించిన 78వ స్వాతం త్ర్య దినోత్సవంలో ఆవిష్కరించారు. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలు, మహిళల కోలాట ప్రదర్శనలతో త్రివర్ణ దుస్తులు ధరించిన ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏర్పాటైన జెండా నేటికి 365 రోజులు పూర్తయింది. (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)


వందడుగుల జాతీయ జెండా పర్యాటక ప్రాంతంగా మారింది. రాత్రి వేళల్లో కనిపించేందుకు విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేశారు. అల్లంత దూరం నుంచి ఎత్తున కనిపిస్తున్న జెండాను దగ్గర నుంచి చేసేందుకు జనం వస్తున్నారు. జెండాను ఫొటో, వీ డియో తీయడంతో పాటు అక్కడ పోటీ పడి సెల్ఫీలు దిగుతున్నారు. అత్యున్నత స్థాయి ఇంజనీరింగ్, నాణ్య తా ప్రమాణాలతో బేస్మెంట్ నిర్మించి, ఉక్కుతో ఏర్పాటు చేశారు.

జాతీయ భావం పెంపొందించేందుకే..



ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకే నూరడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశాం. నియోజక వర్గ కేంద్రానికి వచ్చిన మంత్రులు, ఉన్నతాధికారులు, అతిథులు జెండాను చూసి మెచ్చుకుంటున్నారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా.
- బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, మిర్యాలగూడ.

పెన్సిల్ మొనపై జాతీయ జెండా



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు పెన్సిల్ మొనపైచెక్కిన జాతీయ జెండా ఆకట్టుకుంటోంది. ప్రెన్సిల్ మొనపై 9మిల్లీమీటర్ల ఎత్తుగల జాతీయ జెండాను 15 నిమిషాల్లో చెక్కారు. గతంలో కూడా ఆవగింజపై, బియ్యపు గింజపై, అగ్గి పుల్లపై జాతీయ జెండాను, సూది రంధ్రంలో పట్టే జాతీయ జెండాను రూపొందించినట్లు సైదులు తెలిపారు.
- ఆంధ్రజ్యోతి, కోదాడ.

వెండితో ఇండియా గేట్



భువనగిరి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసచారి వెండితో ఇండియా గేట్ సృష్టించారు. రూ.19వేల విలువైన 16తులాల వెండితో నెలరోజులు శ్రమించి 3.5 ఇంచుల ఎత్తు, 3 ఇంచుల వెడల్పుతో ఇండియా గేట్ రూపొందించారు. అతని ప్రతిభను పలువురు అభినందిస్తున్నారు. కాగా ఇతను గతంలోనూ బంగారం, వెండితో పలు కళాఖండాలు రూపొందించాడు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నిత్యకల్యాణోత్సవం, సుదర్శన నారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజ లు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,13,583 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు. దేవస్థానంలో కొండకింద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేసుకునేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. రోజుకు నాలుగు విడతలు జరిగే వ్రతాలు 10 గంటలకు జరిగే రెండో విడత ఉచిత వ్రతాలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఈ మేరకు 210 మంది భక్తులు బుధవారం సాయంత్రం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరందరికి ఉచిత పూజ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తారు. కాగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు నిత్యం అందించే ఉచిత ప్రసాద వితరణకు హైదరాబాద్ చెందిన పుస్తె సత్యనారాయణ, సరళాదేవి దంపతులు గురువారం రూ.5లక్షల చెక్కును విరాళంగా ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మకు అందజేశారు.

నేడు గుట్టకు మంత్రి రాక

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం కొండపైన దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా 'యాదగిరి ఆధ్యాత్మిక మాస పత్రిక' ను ఆవిష్కరించి ఈ-ఆఫీస్‌ను ప్రారంభిస్తారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారు. కాగా, శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని శనివారం (రేపు) మల్లాపురం దేవస్థాన గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్టాపనకు ఈవో ఎస్. వెంకట్రావు ప్రకటించారు.

కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో గురువారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు కమణీయంగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంత్ కబీర్ అవార్డు గ్రహీత జెల్ల వెంకటేశ్ మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన జాతీయ సంతు కబీర్ అవార్డు గ్రహీత జెల్ల వెంకటేశం అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. చేనేత రంగానికి విశిష్ట సేవలందించిన జెల్ల వెంకటేశ్ రాష్ట్ర, జాతీయ అవార్డులు అందుకున్నారు. 10 సంవత్సరాల పాటు కొయ్యలగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. కొయ్యలగూడెం చేనేత వస్త్రాలకు జాతీయ అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంలో వెంకటేశ్ పాత్ర గొప్పది. అనేక ముఖ్య పట్టణాల్లో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించారు. వెంకటేశ్ అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరిగాయి. వెంకటేశ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

నల్లగొండ జిల్లా పరిధిలోని ప్రధాన ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ జలాశయానికి స్వల్పంగా నీటిరాక తగ్గినా 26క్రస్టు గేట్లనుంచి నీటిని విడుదల చేస్తున్నారు. డిండి ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరింది. మూసీకి వరద కొనసాగుతోంది.

నాగార్జునసాగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక స్వల్పంగా తగ్గింది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువనుంచి 2,28,141 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా గురువారం సాయంత్రం 6 గంటలకు 1,72,774 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.50 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి మొత్తం 2,37,056 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

డ్యామ్‌కు త్రివర్ణ శోభ

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ క్రస్ట్ గేట్లపై మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో సాగర్ డ్యామ్ త్రివర్ణ సాగరంగా మారింది. ఈ సుందర మనోహర దృశ్యం పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తోంది.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గత వారం రోజులకు పైగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నదికి చేరిన వరద దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టు గత వారం రోజులుగా వరద నీటితో పొంగి పొర్లుతోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇన్‌ఫ్లో 13254.45క్యూసెక్కులుగా నమోదయ్యింది. వరద ఉధృతి గురువారం ఉదయం వరకూ కొనసాగింది. హైదరాబాద్ నగరంతో పాటు యాదాద్రి జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసే వీలుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు 643.05అడుగుల గరిష్ఠ స్థాయిలో ఉన్న ప్రాజెక్టు నీటిమట్టాన్ని భారీగా తగ్గించే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రాజెక్టు 2, 3, 4, 5, 6, 7, 8, 10నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తి 10098క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీ రిజర్వాయర్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 6612.55క్యూసెక్కులుగా నమోదయ్యింది. ఇదిలా ఉంటే 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.55అడుగులు (3.84టీఎంసీలు)గా ఉంది.


సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లనుంచి కిందకి వెళ్తున్న వరద

బీ.వెల్లెంల రిజర్వాయర్ గేట్లు మూసివేత

నార్కట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా బీ.వెల్లెంల రిజర్వాయర్ నుండి కుడి, ఎడమ కాలువలకు వదులుతున్న నీటి విడుదలను బుధవారం సాయంత్రం నుండి నిలిపివేసినట్లు ప్రాజెక్టు ఏఈఈ నవీన్ కుమార్ తెలిపారు. వాతావరణం సాధారణ స్థితికి చేరిన తర్వాత ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాల మేరకు గేట్లను తెరుస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

ఉధృతంగా దుందుభి వాగు

డిండి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి వల్ల గతవారం రోజులుగా ఎగువన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో కురుస్తున్న భారీ వర్షాలకు డిండి ప్రాజెక్టు నీటి మట్టం 36 అడుగుల గరిష్ఠస్థాయికి చేరింది. దుందుభివాగుకు వరద ప్రవాహం పెరగడంతో గురువారం ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అయింది. ఎగువ నుంచి 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ తెలిపారు. ఈ వానాకాలం ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలోని 12,500 ఎకరాలకు, కుడికాల్వ పరిధిలోని 300 ఎకరాలు సాగులోకి రానుంది. ఇప్పటికే గతనెల 30న డిండి ప్రాజెక్టు నీటిని వానకాలం సాగుకు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ విడుదల చేశారు. స్పిల్‌వే వియర్ నుం చి దిగువకు నీరు విడుదలవుతోంది. డిండి వాగుద్వారా దిగువకు విడుదలైన నీరు బక్కలింగాయపల్లి వద్ద నాగార్జున సాగర్ బ్యాక్‌వాటర్‌లో కలుస్తుంది.


అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు

రెవెన్యూ, పోలీస్ అధికారుల హెచ్చరిక

డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టు దిగువన చేపలవేటకు పశువులు, గొర్రెలు మేపేందుకు వెళ్లకూడదని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. స్పిల్‌వే వియర్ వద్ద సెల్ఫీల కోసం నీటిలోకి దిగరాదని వారు హెచ్చరించారు.

పదవీ కాలం మరో ఆరు నెలలు

● ప్రభుత్వం ఉత్తర్వులు ● సొసైటీలకు సమకూరనున్న నిధులు

నల్లగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్), డీసీసీబీ పాలకవర్గం గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారంతో పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సహకార ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనందున, సొసైటీల అభివృద్ధి కుంటుపడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు పరిధిలో 108 సొసైటీలు ఉన్నాయి. దీంతో పాటు బ్రాంచ్‌లను కూడా విస్తరించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.2750కోట్లకు పైగా ఉండగా రూ.3వేల కోట్ల టర్నోవర్ కోసం ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13తో పీఏసీఎస్‌తో పాటు డీసీసీబీ పాలకవర్గం ముగియడంతో ఆరు నెలల పాటు ప్రభుత్వం పొడిగిస్తూ అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి పదవీ కాలం ముగుస్తున్న క్రమంలో మరో ఆరు నెలల పాటు పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గం బాధ్యతలు నిర్వహించనున్నాయి. సొసైటీలకు, డీసీసీబీకి స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే పాలన మందగించి అభివృద్ధి కుంటుపడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సహకార రంగంపై దృష్టి సారించి జీవో నెంబర్ 74ను జారీ చేసింది. సహకార వ్యవస్థ నిబంధనలు, 1964 యాక్ట్ ప్రకారం గడువు పొడిగించినప్పుడల్లా పదవీకాలం ఆరు నెలల వరకు పెరుగుతుంది. ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల అనంతరమే పీఏసీఎస్‌ల ఎన్నిక నిర్వహించి డీసీసీబీ పాలకవర్గాన్ని కూడా ఎన్నుకునేందుకు చర్యలు తీసుకోనుంది. పాలకవర్గాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందున సొసైటీలకు, డీసీసీబీకి పెద్ద మొత్తంలో నిధులు సమకూరనున్నాయి. అదేవిధంగా డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాస్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైనందున జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు అత్యధికంగా నిధులు రప్పించేందుకు అవకాశం ఏర్పడింది. అదేవిధంగా రైతులకు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలతో పాటు విద్యా రుణాలు, గోల్డ్ లోన్‌లు, ఇంకా ఇతర రుణాలు భారీగా మంజూరు చేసేందుకు కూడా అవకాశం ఏర్పడింది.

సొసైటీలను మరింత బలోపేతం చేస్తాం: డీసీసీబీ చైర్మన్

పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గం గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసినందున సొసైటీలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం కలిగింది. ఆరు నెలల పాటు పదవీకాలం పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు. నాస్కాబ్ డైరెక్టర్, డీసీసీబీ చైర్మన్‌గా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పీఏసీఎస్‌లను, డీసీసీబీని బ్రాంచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం సంతోషకరం. రైతుల కోసం రైతులతో 107 సంవత్సరాల క్రితం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఈ సంవత్సరం పైగా కాలంలోనే రూ.3వేల కోట్ల టర్నోవర్ వరకు తీసుకుపోవడానికి డీసీసీబీ పాలకవర్గ సభ్యులతో పాటు పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఎంతగానో సహకరించారు.. రాబోయే రోజుల్లో బ్యాంకు మరింత అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తాం.

జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణి



సూర్యాపేట టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణిని నియమించారు. ఈ మేరకు కృష్ణవేణి పేరున తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో అనుబంధ సంఘాలతో పాటు పలు జిల్లాల అధ్యక్షులను కవిత ప్రకటించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్‌కు చెందిన సూరారపు కృష్ణవేణిని జిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షు రాలిగా అవకాశం ఇచ్చిన కవితకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను, సమర్థంగా నిర్వహిస్తానని, జిల్లాలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని అన్నారు.

వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో అండర్- 15 బాలబాలికల వాలీబాల్ క్రీడా ఎంపిక పోటీలు జరిగాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ఎంపిక పోటీలకు వివిధ పాఠశాలల నుంచి బాల, బాలికలు హాజరై క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన బాల, బాలికలను హైదరాబాద్‌లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-15 బాలబాలికల పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, పీఈటీలు, బాలబాలికలు పాల్గొన్నారు. 14ఎంఆర్‌జీడి03: దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అపజయాలు.. విజయానికి సోపానాలు


బెల్లి జనార్దన్ దంపతులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు

మర్రిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అపజయాలను విజయానికి సోపాలుగా విద్యార్థులు మలుచుకోవాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్, నటుడు, నిర్మాత బెల్లి జనార్దన్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ శిక్షణ ఇచ్చారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే యువత విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మెలగాలన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడితే కలిగే నష్టాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్స్ బ్యాగ్స్‌లను పంపిణీ చేశారుఅనంతరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బెల్లి జనార్దన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, ఉదావత్ లచ్చీరాం, ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీనివాస్, సభావత్ వెంకట్‌కుమార్‌మీనా, ధనలక్ష్మి, స్వరూప రాణి, ఫరంగి, సికిందర్, గిరి వెంకటయ్య, శ్రీనివాస్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

17న ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 17వ తేదీన పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ సంస్థ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 9398081178ను సంప్రదించాలని కోరారు.

క్రీడా పాఠశాలకు 14 మంది ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకీ, అథ్లెటిక్స్ హ్యాండ్‌బ్యాల్, ఫుట్‌బాల్ క్రీడా అకాడమిలో 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో జూలై 15, 16 తేదీల్లో జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా కు చెందిన తొమ్మిది మంది బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికయ్యారని డీవైఎస్‌వో అక్బర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో నల్లగొండకు చెందిన భావన ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

నేటి నుంచి వార్షిక టోల్ పాస్ విధానం

● రూ.3వేలతో ఏడాదికి ఒకసారి రీచార్జీతో 200 ట్రిప్పులు


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

కేతేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్) విధానం 65వ నెంబర్ జాతీయ రహదారిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మూడు టోల్‌ప్లాజాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. ఏడాదికి ఒకసారి రూ.3వేలతో వార్షిక ఫాస్టాగ్‌ను రీచార్జీ చేయించే నాలుగు చక్రాల సొంత వాహనదారులకు(తెలుపు రంగు ప్లేట్) టోల్ భారం తగ్గనుంది. నాలుగు చక్రాల ట్యాక్సీ వాహనాలకు (పసుపు రంగు ప్లేట్) ఈ వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్) వర్తించదు. ఈ వార్షిక టోల్‌పాస్ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలలో మాత్రమే పని చేస్తుంది. ఈ పాస్‌తో ఒక్కో వాహనం జాతీయ రహదారులపై 200ట్రిప్పులు తిరిగే వెసులుబాటు ఉంది. ఒక టోల్‌ప్లాజా నుంచి ఒక వైపు ప్రయాణానికి ప్రస్తుతం నాలుగు చక్రాల వాహనదారుడు రూ.50 నుంచి రూ.130 వరకు చెల్లించాల్సి వస్తుండగా వార్షిక టోల్‌పాస్‌తో కేవలం రూ.15కే ఒక టోల్‌ప్లాజాను దాటే వీలు కలుగుతుంది. ప్రస్తుతం 65వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికిల్ వాహనదారులు ఒక ట్రిప్పుకు ఈ రహదారిపై గల యాదాద్రిభువనగిరి జిల్లా పతంగి టోల్‌ప్లాజాలో రూ.80, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో రూ.130, ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు టోల్‌ప్లాజాలో రూ.105 మొత్తంగా రూ.305 చెల్లిస్తున్నారు. ఇరువైపులా ప్రయాణానికి రూ.610 చెల్లించాల్సి ఉంటుంది. ఈ వార్షిక టోల్‌పాస్‌తో ఈ రహదారిలోని మూడు టోల్ ప్లాజాలను దాటడానికి కేవలం రూ.45 మాత్రమే భరించాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంతో కలిపితే ఒక వాహనం రూ.90తో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లి రావచ్చు. అయితే ఈ వార్షిక పాస్ వాహనదారులంతా తీసుకోవడం తప్పనిసరేమీ కాదు. వాహనదారుల రోజువారీ టోల్‌చార్జీలను తగ్గించడమే లక్ష్యంగా అమలుచేస్తున్న ఈ వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్)ను ఇష్టపడని వారు ప్రస్తుతం వాడుతున్న సాధారణ ఫాస్టాగ్‌తో యథాత థంగా ప్రయాణించే వెసులుబాటు వాహనదారులకు కల్పించారు. హైదరాబాద్ - విజయవాడల రహదారిపై ఇరువైపులా సాధారణ రోజుల్లో 9వేల నుంచి 12వేల వాహనాలు ప్రయాణిస్తుండగా వారాంతపు రోజుల్లో దాదాపు 15 వేల వరకు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పండగ రోజుల్లో ఈ సంఖ్య 20 వేల వరకు ఉంటుంది.

వార్షిక ఫాస్టాగ్ ఎలా తీసుకోవాలి?

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వార్షిక ఫాస్టాగ్ కోసం వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి వాహన రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో రూ.3వేలు చెల్లిస్తే ప్రస్తుత ఫాస్టాగ్‌కు లింక్ అవుతుంది. వాహనదారుడు ప్రస్తుతం వినియోగిస్తున్న ఫాస్టాగ్ బ్లాక్‌లిస్టులో లేకుండా యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాలి.

వార్షిక టోల్‌పాస్ అమలుకు ఏర్పాట్లు చేశాం

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న వార్షిక టోల్‌పాస్(ఫాస్టాగ్) అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. వార్షిక టోల్‌పాస్ కలిగిన వాహనాల కొరకు టోల్‌ప్లాజాలో ప్రస్తుతానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏమీ లేవు. భవిష్యత్తులో ఎన్‌హెచ్ఏఐ ఆదేశిస్తే ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. వార్షిక ఫాస్టాగ్ కలిగిన వాహనాలు టోల్‌ప్లాజాలోని ఏ కౌంటర్ నుంచైనా వెళ్లవచ్చు.
-ఇమ్రాన్, మేనేజర్, కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

నానో యూరియా వాడకంపై అవగాహన

శాలిగౌరారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడకంపై రైతులలకు ఏవో సౌమ్య శృతి అవగాహన కల్పించారు. నానో యూరియా చిన్న డబ్బాలో ద్రవరూపంలో ఉంటుందని దానిలో నత్రజని కూడా ఉంటుందని తెలిపారు. ఈ నానో యూరియా డబ్బాను ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చని అన్నారు. నానో యూరియా వాడకం వల్ల రవాణా చార్జీలు మిగులుతున్నాయన్నారు. నానో యూరియాతో తక్కువ ఖర్చులో ఎక్కువ పంట దిగుబడి వస్తుందని తెలిపారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నార్కట్‌పల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎం.ఎడవల్లి గ్రామానికి చెందిన యాదమ నర్సింహ వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్సీ సత్యం గురువారం అందజేశారు. నర్సింహ తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. అతని పరిస్థితిని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన ఎల్‌వోసీని నర్సింహ కుటుంబసభ్యులకు అందజేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నల్లగొండటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాగర్ ఎక్స్ రోడ్డులోని శ్రీచైతన్య హైస్కూల్‌లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ఎంతగానో అలరించారు. అనంతరం ఆటపాటలతో ఆకట్టుకోవడమే కాకుండా ఎంతో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సీహెచ్ యాదయ్య, గడ్డం త్రిమూర్తి, యాస శ్రీనివాస్‌రెడ్డి, కె.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ధనుంజయ్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లెలు

- భక్తి శ్రద్ధలతో శ్రావణ బోనాలు
- జిల్లాలో పలుచోట్ల వైభవంగా నిర్వహణ

కేతేపల్లి, నార్కట్‌పల్లి, తిప్పర్తి, నకిరేకల్, కనగల్, కట్టంగూరు, శాలిగౌరారం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నెత్తిన బోనాలు.. డప్పు చప్పుళ్లు.. అలంకరించిన బండ్లు వెరసి జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామాల్లో గురువారం వైభవంగా బోనాల పండుగను నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మహిళలు పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని ప్రదర్శనగా దేవాలయాల వద్దకు చేరుకున్నారు. సంప్రదాయ డప్పు నృత్యాల మధ్య ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనాన్ని అలంకరించి ప్రదర్శనగా ఆలయాలకు చేరుకున్నారు. బోనాల్లో వండిన నైవేద్యాన్ని తమ ఆరాధ్య గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చిన భక్తులు అమ్మవారికి చీర, సారెలతో పాటు కోళ్లు, జీవాలను బలి ఇచ్చి తమ మొ క్కులు తీర్చుకున్నారు. రైతులు తమ ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను అమ్మవారి గుడి చుట్టూ తిప్పి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. అంటువ్యాధులు సోకకుండా గ్రామాన్ని కాపాడాలని వేడుకున్నారు.

● కేతేపల్లి మండలంలోని కొప్పోలు, భీమారం, కేతేపల్లి గ్రామాల్లో ముత్యాలమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన బోనాలను ముత్యాలమ్మ తల్లికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ వేడుకల్లో మాజీ జడ్పీటీసీ జె.లక్ష్మమ్మ, కేతేపల్లి శివాలయ కమిటీ చైర్మన్ ఎస్.జేజయ్య, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు బి.శ్రీనివాసయాదవ్, బి.కవిత, బీరం జాన్‌రెడ్డి, మట్టి సాల్మన్, ఎ.జోగిరెడ్డి, ఎ.జైదీప్‌రెడ్డి, ఎ.కేశవరెడ్డి, జె.వెంకటనర్సయ్యయాదవ్, ఎ.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం గ్రామంలో ముత్యాలమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు చెరుకు పెద్దులు, గడ్డం పశుపతి, పనస వెంకటయ్య, ఆంజనేయులు, నర్సింహ పాల్గొన్నారు.

● తిప్పర్తి మండలంలోని తిప్పర్తి, జంగారెడ్డిగూడెం, తిప్పలమ్మగూడెం గ్రామాల్లో అమ్మవార్లకు బోనం సమర్పించారు. తిప్పర్తి పరిధిలో త్రిపుర సుందరీదేవీ మాతకు ప్రతి ఏడాది మాదిరిగానే పెద్ద ఎత్తున బోనాలతో భక్తులు చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బుక్క నర్సింహ, బీమనబోయిన జానయ్య, సిరసవాడ గోవర్ధన్, పోలెబోయిన కిరణ్‌కుమార్, వెంకట్‌నారి, సతీష్, పరమేష్, లక్ష్మయ్య, జానయ్య, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

● నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డులో ఉన్న ముత్యాలమ్మతల్లికి గురువారం మహిళలు బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే ముత్యాలమ్మ తల్లి దర్శనం కోసం దేవాలయం ఎదుట బారులు తీరారు. సంప్రదాయ పద్ధతిలో మహిళలు అమ్మవారికి బోనాలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, ముత్యాలమ్మ దేవాలయం, శివాలయం చైర్మన్లు పన్నాల రాఘవరెడ్డి, ఉప్పల రమేష్, దేవాలయ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రావణ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కనగల్, చెట్లచెన్నారం తదితర గ్రామాల్లో బోనాలను అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు నర్సింగ్ సునీతకృష్ణయ్యగౌడ్, చిట్ల లింగయ్యగౌడ్, నర్సింగ్ మురళిగౌడ్, మట్టపల్లి సైదులుగౌడ్, రాజ, గ్రామస్థులు పాల్గొన్నారు.

● కట్టంగూరు మండలంలోని కురుమర్తి, అయిటిపాముల, పరడ, మునుకుంట్ల, గిద్దలూరు, గొల్లేపల్లి గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లికి భక్తితో నైవేద్య ప్రసాదం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామస్థులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని ఆకారం, అడ్లూరు, రామగిరి, కొత్తపల్లి, మాదారం, పెర్కకొండారం, రామాంజపురం, ఉప్పలంచ తదితర గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు నూతన వస్త్రాలు ధరించి బోనం ఎత్తుకొని ప్రదర్శనగా వెళ్లి ముత్యాలమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు.


కేతేపల్లి: బోనాలతో ముత్యాలమ్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు


శాలిగౌరారం: ఆకారం గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


నకిరేకల్: అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులుదీరిన మహిళలు


తిప్పర్తి : జంగారెడ్డిగూడెంలో బోనాలతో వెళ్తున్న గ్రామస్థులు

తుర్కకాశ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తుర్క కాశ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ తుర్కకాశ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే. బడేసాబ్, జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీం అన్నారు. గురువారం మౌలానా అక్బర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో తుర్క కాశ కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికబంధు రూ. 10లక్షలు, 45 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికునికి కార్మిక పింఛన్ ఇవ్వాలని, రాయి కొట్టే కార్మికునికి ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ఆ మెడికల్ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలను తమ సంఘ సొసైటీకి ప్రభుత్వం ఇవ్వాలని, వారు నివసించే ప్రాంతాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చే యాలని కోరారు. తురక కాశ యువకులకు ప్రత్యేకకార్పొరేషన్ ద్వారా విద్య, ఉపాధి, అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి తుర్క కాశ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కార్మిక సంఘం నాయకులు షేక్ లతీఫ్, షేక్ అలీ, షేక్ లతీఫ్, భాష తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ సత్యాన్ని కలిసి సమస్యలు వివరిస్తున్న తుర్కకాశ కార్మికసంఘం నాయకులు

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం


కుంగిన పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్రూం ఇళ్ల దగ్గర నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వర్షాలకు కుంగిందని, అందుకు కారణమైన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను, కుంగిపోయిన సెప్టిక్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం లాటరీ ద్వారా నల్లగొండ పట్టణంలో 552 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. పేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో చేసిన ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం రూ.1.50 కోట్లు విడుదల చేసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్, వాటర్ ట్యాంకు తదతర పనులు చేపట్టినట్లు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. దీంతో పట్టణంలో కురిసిన వర్షాలకు సెప్టిక్ ట్యాంక్ కుంగిపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇచ్చి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవుట రవీందర్, తుమ్మల పద్మ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ముషంపల్లి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగార్జున

నల్లగొండ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ నుంచి ముషంపల్లికి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదరమయంగా మారడంతో గురువారం రోడ్డుపై బురదలో సీపీఎం ఆధ్వర్యంలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ - ముషంపల్లి వెళ్లే రోడ్డు పనులు చేపట్టి రెండేళ్లయినా పూర్తి కాలేదని విమర్శించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డబ్బు లేదనే సాకుతో రోడ్డు పనులు నిలిపివేయడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్లతో సమీక్షించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశా రు. వర్షాల కారణంగా రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడి బురదమయంగా మారాయని అన్నారు. గుంతలను మట్టితో పూడ్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా నడవడానికి అనుకూలంగా మరమ్మతులు చేయాలని కోరారు. లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, నాయకులు జిల్లా అంజయ్య, కొండ వెంకన్న, బక్కయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులు పూర్తి చేయాలని బురదలో నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మండల ప్రత్యేకాధికారి వేణుగోపాలాచారి

మర్రిగూడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని మండల ప్రత్యేకాధికారి వేణుగోపాలాచారి అన్నారు. మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం, మోడల్ పాఠశాల, ప్రభుత్వ 30 పడకల సామాజిక ఆరోగ్య కమ్యూనిటీ ఆస్పత్రిని గురువారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కస్తూర్బాగాంధీ మోడల్ పాఠశాలలోని వంటలు పరిశీలించారు. వంటలు సక్రమంగా ఉండాలని వంట సామగ్రిని శుభ్రం చేయాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగలకు వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో మున్నయ్య, ఎంఈవో బిట్టు శ్రీనివాస్, డాక్టర్ శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ జ్యోతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నల్లగొండటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ అకాల మృతి చెందిన కత్తుల గోపి కుటుంబానికి మహనీయుల ఆశయ సాధన సేవాసంఘం (మాస్), మాదిగ సంఘాల జేఏసీ చేయూతనిచ్చింది. ఈ మేరకు ఆయా సంఘాల రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్‌జయరాజ్ ఆధ్వర్యంలో గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కత్తుల షణ్ముఖ కుమార్, గౌరవ సలహాదారులు కత్తుల శంకర్, జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు చింత శివరామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు విరిగి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

మోదీ కార్పొరేట్ విధానాలపై ఉద్యమించాలి

కట్టంగూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు బూరుగు అంజన్న స్ఫూర్తితో మోదీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్ పిలుపునిచ్చారు. కట్టంగూరు మండలంలోని ఈదులూరులో గురువారం నిర్వహించిన అంజన్న వర్థంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నిజాం నవాబు, రజాకార్లను ఎదురొడ్డి పోరాడిన అంజన్న పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శప్రాయమన్నారు. దేశంలో మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్‌లకు తొత్తులుగా మారిందని, అదానీ, అంబానీలకు దేశాన్ని తాకట్టు పెట్టాడని సాగర్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, జిల్లా నాయకులు గజ్జి రవి, అయితగోని నారాయణ, బూరుగు సత్తయ్య, బొంగరాల నర్సింహ, బొమ్మిడి నగేష్, పజ్జూరు ఉపేంద్ర, వెంకటేశ్వర్లు, బీవీ చారి, వెంకన్న, జానయ్య, రావుల లింగయ్య, శంకర్, లక్ష్మమ్మ, పార్వతమ్మ, వెంకన్న, దేవయ్య, శారద, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి నింపేందుకే తిరంగాయాత్ర

నార్కట్‌పల్లి, నకిరేకల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్ర తీ పౌరుడిలో దేశభక్తిని నింపేందుకే ప్రధాన మంత్రి న రేంద్రమోదీ హర్ ఘర్ తిరంగ్ యాత్ర కార్యక్రమానికి పిలుపునిచ్చారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ స భ్యురాలు కన్మంతరెడ్డి శ్రీ దేవిరెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రం లో గురువారం నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా యాత్రలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశభక్తి దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి కవచంలా ఉంటుందన్నారు. తిరంగాయాత్ర సందర్భంగా 70 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని ర్యాలీగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతికుమార్, కన్నెబోయిన నర్సింహ, బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బిల్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు నోముల నాగరాజు, మల్లెబోయిన రామలింగం, వడ్డేగోని రామలింగం, సీనియర్ నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, మునుకుంట్ల నర్సింహ్మా, కల్లూరి కార్తీక్, మునుగోటి ప్రసాద్, నల్లగొండ నాగరాజు, పల్లెర్ల నాగరాజు, సత్యనారాయణ, పాలకూరి రమేశ్, ఉండ్రాతి సత్యనారాయణతో పాటు ఎంజేపీ గురుకుల విద్యార్థులు పోలీసులు పాల్గొన్నారు.


నార్కట్‌పల్లిలో మానవహారంగా తిరంగాయాత్ర

● నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలా కానిచ్చేశారు!

(5వ పేజీ తరువాయి)


ప్రభుత్వం మళ్లీ ఈ కేసును కదలించడంతో బిల్లులు చెల్లించిన జిల్లా అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది.

చెల్లింపుపై గోప్యత

గొర్రెల కొనుగోలు సక్రమంగానే జరిగాయని, అందుకే బిల్లులు చెల్లించామని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. సుమారు రెండేళ్ల పాటు బిల్లులను పెండింగ్‌లో ఉంచిన యంత్రాంగం వాటిని ఎలా చెల్లించే సహసం చేసిందనేది చర్చనీయాంశమైంది.

1,172 నకిలీ ఇన్ వాయిస్‌లు ఉండటం, 90కిపైగా రిసైక్లింగ్ కేసులు ఉన్న సమయంలో దళారుల వద్ద నుంచే గొర్రెలను కొనుగోలు చేశారని ఈడీకి సైతం నివేదిక అందజేసిన అధికారులే ప్రస్తుతం స్కాం లేదంటూ రూ.6కోట్ల బిల్లును చెల్లించడం గమనార్హం. జిల్లా అధికారులు ఈ బిల్లులు చెల్లించినట్లు ఉన్నతాధికారులకు సమాచారం చేరినట్లు తెలిసింది. అదేవిధంగా ఈ నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'గొర్రెల స్కామ్..అదెక్కడ?' శీర్షిక కథనం ప్రచురితం కాగా, దీనిపై సైతం ఉన్నతాధికారులు ఆరా తీసి, నివేదిక కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అక్రమాలు జరిగాయని అప్పట్లో అధికారులు నివేదిక ఇస్తే ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు బిల్లులు ఎలా చెల్లించారనే దానిపై విచారణ నిర్వహించే అవకాశం ఉంది. అయితే బిల్లుల చెల్లింపుపై గోప్యత పాటిస్తున్న అధికారులు దీన్ని కప్పిపుచ్చుకునేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 21.4
ANDHRAJYOTHY

నల్లగొండ
5
శుక్రవారం 15 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.803)	1,72,774	2,37,056
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.50 (3.84)	6,612	10,098
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.011 (38.360)	2,71,900	1,81,334

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



అలా కానిచ్చేశారు!

» గతంలో బిల్లులు చెల్లింపును తిరస్కరించిన ఓ సీనియర్ అధికారి
» కేసు చల్లబడిందనే ఆలోచనతో చెల్లించిన యంత్రాంగం
» అక్రమాలు జరిగాయని ఈడీకి సైతం నివేదికలు
» బిల్లులపై గోప్యత పాటిస్తున్న పశుసంవర్ధకశాఖ

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గొర్రెల స్కాం బయట పడిన వెంటనే దానికి ఆజ్యం పోసింది ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనే విషయం గతంలో చర్చనీయాంశమైంది. ఓ ద్విచక్ర వాహనంపై 200 గొర్రెలు, ఒక ఆటోలో 1,320 గొర్రెలను తరలించినట్లు రికార్డుల్లో నమోదు చేయడాన్ని కాగ్ వెలుగులోకి తెచ్చింది. అక్రమాల నేపథ్యంలో దీనికి సంబంధించిన రూ.18కోట్ల బిల్లుల చెల్లింపులను అధికారులు నిలిపివేశారు.అయితే తాజాగా అసలు అక్రమాలే లేవంటూ ఇటీవల జిల్లా అధికారులు రూ.6కోట్ల బిల్లులు చెల్లించడం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

గొర్రెల యూనిట్ల కొనుగోలు సందర్భంగా వాటిని తరలించేందుకు అధికారులు కనీసం వాహనాల నెంబర్లు ఏమిటనేది కూడా చూడకుండా అత్యుత్సాహం ప్రదర్శించారు. గుర్తు తెలియని వాహనాల నెంబర్లతో ఇన్‌వాయిస్‌లు రూపొందించి గొర్రెలను తీసుకవచ్చినట్లు నివేదిక ఇచ్చి అక్రమార్కులు ఏసీబీకి, ఈడీ, కాగ్‌కు అవలీలగా చిక్కారు. దీంతో సుమారు రూ.18 కోట్ల వరకు బిల్లులు నిలిపివేస్తూ అప్పట్లో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సుమారు రెండు ఏళ్ల వరకు బిల్లులను పెండింగ్‌లో పెట్టిన అధికారులు రెండు నెలల క్రితం అందులో రూ.6కోట్లను రిలీజ్ చేశారు. అంతా పశుసంపద ఉన్న రైతులేనని, సరైన డాక్యుమెంట్లు ఉన్నాయని బిల్లులు చెల్లించామని పశు సంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నిబంధనల మేరకు ఒక రైతు నుంచి 10 నుంచి 12 యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. ఒక్కో రైతు నుంచి 270 గొర్రెలు సేకరించవచ్చు. కానీ అధికారులు, రైతుల నుంచి గాక దళారుల నుంచి పెద్దమొత్తంలో గొర్రెల యూనిట్లు కొనుగోలు చేశారు.

బిల్లులను తిరస్కరించిన అధికారి

గొర్రెల కొనుగోలులో కొందరు అధికారులు, డాక్టర్లు దళారులతో కుమ్మకై అక్రమాలకు పాల్పడినట్లు గతంలో విమర్శలు వచ్చాయి. అధిక మొత్తంలో గొర్రెల యూనిట్లను ఉమ్మడి నల్లగొండ జిల్లాకు విక్రయించిన దళారులు, ఆ బిల్లులను తీసుకోవడం కోసం పశుసంవర్ధకశాఖకు బిల్లులను పెట్టి విశ్వ ప్రయత్నం చేశారు. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పశుసంవర్ధక శాఖలో పనిచేసిన ఓ సీనియర్ అధికారి ఈ బిల్లుల చెల్లింపును తిరస్కరించారు. దీంతో ఉన్నతాధికారుల వద్ద సుమారు 15నెలల వరకు ఈఫైల్ పెండింగ్‌లో ఉంది. ఈ ఫైల్‌ను కదిలిస్తే తమ మెడకు చుట్టుకుంటుందని భావించిన అధికారులు దాన్ని పక్కన పెట్టారు. అయితే రెండు నెలల క్రితం ఏ విధంగా బిల్లులు చెల్లించారనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. సంబంధిత శాఖలోనే ఈ అక్రమాలపై గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏ లెక్కన బిల్లులు ఇచ్చారు? ఎంత మందికి ఇచ్చారు? ఆ డాకుమెంట్లు సరియైనవేనా? అని పరిశీలన చేయలేదని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజులుగా రాష్ట్రంలో గొర్రెల స్కాంపై పెద్ద సందడి లేదు. దీంతో కేసు చల్లబడిందన్న ఆలోచనతోనే దళారులకు బిల్లులు చెల్లించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 10రోజుల క్రితం అనూహ్యంగా రాష్ట్ర...

- మిగతా 8వ పేజీలో...

డాక్యుమెంట్లు చూసి బిల్లులు చెల్లించాం

డాక్యుమెంట్లను పూర్తిగా పరిశీలించిన తరువాత అవి సరియైనవని భావించి బిల్లులు చెల్లించాం. ఇంకా ఎంత పెండింగ్‌లో ఉందనేది మా వద్ద సమాచారం లేదు. అయితే ఇంకా బిల్లులు పొందాల్సిన వారు 100మంది వరకు ఉండి ఉండవచ్చు. రెండు నెలల క్రితం రూ.6కోట్ల వరకు చెల్లించాం. జిల్లాలో గొర్రెల కొనుగోళ్ల విషయంలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోలేదని భావించినందునే బిల్లులు చెల్లించాం.

- డాక్టర్ రమేష్, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ

● స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబు



స్వాతంత్ర్య దినోత్సవానికి జిల్లా ముస్తాబైంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, వాడవాడలా జాతీయ పతాకాలను ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పదవీ కాలం మరో ఆరు నెలలు

పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల గడువు పెంపు
ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
భారీగా సమకూరనున్న నిధులు


7



నేటి నుంచి వార్షిక టోల్ పాస్

● రూ.3వేల రీచార్జీతో ఏడాదికి 200 ట్రిప్పులు

7



ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఊహా చిత్రం

విద్యార్థుల ఇక్కట్లు తప్పినట్లే

పాఠశాల ఎదుట ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నిత్యం అత్యంత రద్దీగా ఉండే దేవరకొండ రోడ్డులో ఫుట్ ఓవర్ బ్రిడ్జి (పాదచారుల వంతెన) నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. నేషనల్ హైవే నిధుల ద్వారా రూ.5కోట్లతో ఈ పాదచారుల వంతెనతో పాటు లిఫ్టును, ఎలివేటర్‌ను నిర్మించనున్నారు. దేవరకొండ రోడ్డులోని సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ ఎదుట ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు లిఫ్టు ఎలివేటర్ నిర్మాణం వల్ల నల్లగొండ పట్టణానికి తలమానికం కానుంది. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్రమంత్రి నితీష్ గడ్కరీ కలిసి నిధులు మంజూరు కోసం కృషి చేశారు. రద్దీ అధికంగా ఉండటం వల్ల రోడ్డు దాటే విద్యార్థులకు, పాదచారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నల్లగొండ పట్టణంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నల్లగొండ పట్టణంలోని సిద్ధార్థ కాలనీ, మరియామాత టెంపుల్, బిషప్ హౌజ్, అబ్బాసియా కాలనీలకు వెళ్లడం కోసం రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణ పనులకు శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉదయం 11.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజి



విద్యుత్‌శాఖ సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజీ, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ డైరెక్టర్ శివాజీ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలంలో వర్షాలు, పిడుగులు పడి విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉందని, ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజులు, కనెక్షన్ లైన్లు ముందుగానే మరమ్మతులు నిర్వహించాలన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని అన్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు స్పందించాలన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజీతో కలిసి మైనంపల్లి వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యుత్‌శాఖ సీజీఎం బిక్షపతి, ఆర్డీవో రమణారెడ్డి, డీటీ కృష్ణరావు, డీఈ విద్యాసాగర్, ఏడీ సైదులు, సాగర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్

చిట్యాలరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డెంగీ జ్వరంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు. చిట్యాల మండలం ఏపూర్‌లో డెంగీ జ్వరం వచ్చిన బాలుడి నివాసాన్ని గురువారం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రదీప్, వెలిమినేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహ, ఎంపీడీవో జయలక్ష్మి, వైద్యబృందం పరిశీలించారు. గ్రామంలో 50 ఇళ్లల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి ప్రదీప్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల్లో జ్వరం వస్తుందని జ్వరం మూడు రోజులు దాటితే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అధిక జ్వరం,తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, అలసట, వికారం, వాంతులు, చర్మంపై దద్దుర్లు లక్షణాలు ఉంటే డెంగీ లక్షణాలుగా గుర్తించాలని, వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. ఇంట్లో, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఏపూర్‌లో డెంగీ వచ్చిన బాలుడి కోలుకొని ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేశబోయిన లింగస్వామి, తాటికొండ లింగస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భారీ వర్షాలపై మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో అనుకున్న దానికంటే ఎక్కువ వర్షం కురిసిందని, ఈ నెల 15న కొన్ని జిల్లాల్లో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉ న్నందున కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవాలని, ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ నుంచి కనిష్ఠ స్థాయిలో నీటిని విడుదల చేయాలని సూచించారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేస్తే కా ల్వ తెగిపోయేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నీటి నియంత్రణ చేయాలని ఆయన తెలిపారు. వర్షం వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలాంటి నిధుల కొరతలేదని, ప్రతి జిల్లాకు కోటి రూపాయలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా వర్షాల వల్ల రోడ్లు, విద్యుత్ వంటి వాటికి అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించాలన్నారు. అంటువ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణరావు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల వారీగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో వర్షాల కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అన్నారు. మూసీ ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తిన నీటిని కిందికి వదులుతున్నట్లు తెలిపారు. ప్రభావిత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వర్షాలపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏవైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ ఫోన్‌నెంబర్ 18004251442 కు తెలియజేయాలని కోరారు. వర్షాలు కురుస్తున్నందున రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే విధంగా సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడ తాగునీటి పైప్ లైన్ లీకేజీ వంటివి ఏర్పడకుండా చూడాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి 24గంటలు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రత్యేక అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



వాడపల్లి చెక్‌పోస్టును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండరూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాల అమలులో మండల ప్రత్యేక అధికారుల పాత్ర కీలకమైనదని కలెక్ట ర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువా రం మండల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక అధికారులు మండలాల్లో గుర్తించిన సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తరచూ మండలాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సవ్యం గా అమలు చేసేందుకు కృషి చేయాలని అన్నా రు. యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని జిల్లా రైతులకు మాత్రమే యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితు ల్లో బయటికి పోకుండా చూడాలని సూచించారు. అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి జిల్లాను మరింత అభివృద్ధి పరిచే విధంగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

దామరచర్ల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, మందుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యుడు నాగేశ్వర్‌రావుతో మాట్లాడుతూ మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వెంటనే చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలను ప్రతీ గురువారం వైద్యాధికారి తప్పనిసరిగా సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ వాడపల్లి చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చే సి మాట్లాడారు. చెక్‌పోస్టు మీదుగా పీడీఎస్ బియ్యం, ఇసుక, యూరియా అక్రమంగా బయటకు వెళ్లకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టుల్లో పటిష్ఠ నిఘా పెట్టాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మండలంలోని ఇర్కిగూడెం వద్ద కృష్ణా నది ప్రవాహాన్ని పరిశీలించారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇర్కిగూడెం ఘాట్ వద్ద చేపలు పట్టేందుకు మత్స్యకారులు లోపలికి వెళ్లవద్దని సూచించారు.

'యూరియా' కోటా తీసుకురావడంలో విఫలం

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం)

నల్లగొండ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన యూరియా కోటాను తగ్గించిందని, రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఆ పార్టీకి చెందిన 8 మంది ఎంపీలు యూరియా తీసుకురావడంలో విఫలమయ్యారని సీపీ ఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని మగ్దూం భవనంలో గురువారం నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల కురుస్తున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరిగిందని అన్నారు. రైతులకు యూరియా అందుబాటులో లేకుండా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిన్నారని ఆరోపించారు. బ్లాక్‌లో యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారస్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 20 నుండి 22వ తేదీ వరకు జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సత్యం పిలుపు నిచ్చారు. దేశంలో సీపీఐ వందేళ్ల ప్రస్థానంతో కార్మి కులు, కర్షకులు, అణగారిన వర్గాల ప్రజల కోసం అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందని అన్నారు. దేశంలో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పాలకులు అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తుందన్నారు. ఆర్.అంజనాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యు లు పబ్బు వీరస్వామి, గురిజ రామచంద్రం, పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి


బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

నల్లగొండరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 42శాతం రిజర్వేషన్ల అమలుపై ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదని, ఉంటే ఈ పాటికి అమలయ్యేదని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని తాము పోరాడుతూనే ఉన్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాయకులు అర్థం, పర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. 10శాతం ముస్లింలకు రిజర్వేషన్ తీసేయాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం సవరణ చేసి బిల్లును ఆమోదించవచ్చని అన్నారు. పార్టీ పరంగా బీసీలకు భిక్ష వేయడం కాదు చట్టబద్ధంగా హక్కు కల్పించాలని తెలిపారు. లేనిచో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేర్లకంటి కాశయ్య, కేషబోయిన శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యానారాయణ, వాడపల్లి సాయిబాబా, లింగంగౌడ్, మధు యాదవ్, శంకర్‌గౌడ్, సైదులుగౌడ్, పవన్‌సాయి పాల్గొన్నారు.

● చిత్తడి రహదారిపై నాట్లేసి



జిల్లా కేంద్రంలో రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్న నల్లగొండ-ముషంపల్లికి రహదారి వర్షాలతో చిత్తడిగా మారడంతో సీపీఎం నాయకులు గురువారం ఇలా నాట్లేసి నిరసన తెలిపారు.

8

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 శుక్రవారం 15 ఆగస్టు 2025 2025 www.andhrajyothy.com

ప్రభుత్వ భూముల్లో మట్టిని, ఇసుకను తరలిస్తే చర్యలు

దేవరకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మట్టిని, ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ భూముల్లో మట్టిని, వాగుల నుంచి అక్రమంగా ఇసుకను చెరువులు, కుంటలలో మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు

ఆర్గాన్ డొనేషన్ విభాగ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా విజయభాస్కర్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఆర్గాన్ డొనేషన్ విభాగ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన మిట్టపల్లి విజయభాస్కర్ నియమితులయ్యారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయభాస్కర్ పట్టణ, పరిసర ప్రాంతాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తూ నేత్ర, అవయవదానం చేయించడంలో తనదైన పాత్ర పోషిస్తున్నారు.



దుందుభి వాగును పరిశీలించి మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎస్ఐ లోకేష్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చందంపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందంపేట తహసీల్దార్ శ్రీధర్‌బాబు కోరారు. మండలంలోని దుందుభి వాగును గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. దుందుభి వాగు నుంచి వస్తున్న వరద ఉధృతి కారణంగా చందంపేట, పరిసర ప్రాంతాల ప్రజలు మన్నెవారిపల్లికి వెళ్లేదారికి ప్రత్యామ్నాయంగా వెళ్లాలని ప్రజలను కోరారు. హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఎస్ఐ లోకేష్, రెవెన్యూ, సిబ్బంది ఉన్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

● పలు ప్రాంతాల్లో నీట మునిగిన లోతట్టు పంట పొలాలు ● ఆమనగల్లు చెరువు అలుగుతో భీమారం- సూర్యాపేట రోడ్డుపై రాకపోకలు నిలిపివేత



వేములపల్లి గ్రామ శివారులోని పంటపొలాలపైకి వచ్చి చేరుతున్న వరదనీరు

వేములపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్ప పీడన ప్రభావంతో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పాలేరు, చిత్రపరక వాగులతో పాటు పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అలాగే మండలంలోని చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. చిత్రపరక వాగుకు పైన ఉన్న వేములపల్లి, కుక్కడం, అన్నపరెడ్డిగూడెం చెరువుల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో చిత్రపరక వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాగు వెంట గల పంటపొలాలు కనుచూపు మేర నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పాలేరు వాగుకు భారీగా వరదనీరు రావడంతో చెక్‌డ్యామ్ నిండుకుండలా మారింది. పాలేరు వాగుకు భారీగా ప్రవాహం కొనసాగుతోంది. మరోవైపు ఆమనగల్లు చెరువు మత్తడి నుంచి దుంకుతుండడంతో భారీగా వరద వచ్చి లక్ష్మీదేవిగూడెం గ్రామ శివారులోని లోలెవల్ వంతెనపైకి భారీగా నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో ఆర్డీసీ, పోలీసులు రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. ఈ సందర్భంగా వేములపల్లి ఎస్ఐ పాలేరు వాగుతో పాటు మూసీవాగు పరీవాహ క ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులపై గల లోలెవల్ వంతెనపై రాకపోకలు కొనసాగించరాదని సూచించారు

దేవరకొండలో..

దేవరకొండ : దేవరకొండ మండలం మైనంపల్లి, తాటికోలు వాగులు పొంగిపొర్లుతున్నా యి. ఎగువ భాగమైన నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాలు కురవడంతో దేవరకొండ మండలం తాటికోల్, మైనంపల్లి వాగులు ప్రవహిస్తున్నాయి. వాగులోని నీరు పెండ్లిపాకల చెరువులోకి వెళుతుంది. వర్షాలకు వాగులు ప్రవహిస్తుండడంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల్లోకి నీరు సమృద్ధిగా చేరుకుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యామ్‌లకు జలకళ

మాడ్గులపల్లి : భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. పాలేరు వాగులోకి భారీగా వరద రావడం మొదలైంది. దీంతో చెక్‌డ్యామ్‌లు జలకళను సంతరించుకుని అలుగుపోస్తున్నాయి. వర్షాల కోసం నెలరోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు వరుణుడు కరుణించడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. నకిరేకల్ మండలం తాటికల్, చందుపట్ల, మంగళపల్లిలోని చెరువులు, కుంటలు నిండగా మాడ్గులపల్లి మండలం చిరుమర్తి, పోరెడ్డిగూడెం, ఆగామోత్కూర్ గ్రామాల నుంచి మూసీ నీరు పాలేరు వాగుకు ప్రవేశించడంతో భారీగా నీరు చెక్‌డ్యామ్‌లోకి వచ్చి చేరుతోంది. దీంతో పాలేరువాగుపై ఉన్న మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం, బొమ్మకల్, ఆగామోత్కూ ర్, చిరుమర్తి, వేములపల్లి మండలంలో నిసల్కునూరు చెక్‌డ్యామ్‌లు అలుగుపోస్తున్నాయి. నీరంతా వేములపల్లి మండలంలసల్కునూరు, రావులపెంట గ్రామాల మీదుగా నీరంతా మూసీలోకి వృథాగా వెళ్లిపోతుంది. పాలేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్‌లు అన్ని నిండి అలుగుపోయడంతో భూగర్భజలాలు పెరిగి సుమారు 2వేల ఎకరాలు సాగులోకి వస్తుందని రైతులు ఆశాభా వం వ్యక్తం చేస్తున్నారు.



మాడ్గులపల్లి : కల్వలపాలెంలో అలుగుపోస్తున్న చెక్‌డ్యామ్

నేడు ఉచిత వైద్య శిబిరం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ అంజిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని చర్చిరోడ్డులో గల రివర్ ఆస్పత్రిలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శిబిరంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, ల్యాప్రోస్కోపిక్ సర్జరీ, మూత్ర సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శిబిరానికి హాజరయ్యే రోగులకు ఉచితంగా రూ.10 వేల విలువైన వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా సర్జరీ చేస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

తిరంగా యాత్ర



తిరంగా యాత్రలో పాల్గొన్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం సూచన మేరకు మిర్యాలగూడలో గురువారం తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు సీనియర్ నాయకులు బంటుసైదులు, కనపర్తి సత్యప్రసాద్, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి కొండేటి సరిత, చిలుకూరి రమాదేవి, రమేష్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండమల్లేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలో గురువారం తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. రెండేళ్లుగా మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదని గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'గుమ్మడవెల్లిలో తాగునీటి తంటాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలో మిషన్ భగీరథ అధికారులు కాలనీలో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న

మిర్యాలగూడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ప్రమోటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని మిర్యాలగూడ అధ్యక్షుడు ఆకుమర్తి వెంకన్న అన్నారు. గురువారం స్థానికంగా నిర్వహించిన జనరల్ బాడి సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్ఫేర్ అసోసియేషన్‌ను బలోపేతం చేసుకోవడం ద్వారా మధ్యవర్తులు ఎదుర్కొనే సమస్యలను తేలికగా పరిష్కరించుకోవచ్చునని అన్నారు. ఈ నెల 16న ఉదయం 9.30 గంటలకు బాదలాపురం బందం సమీపంలోని వీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాసుల సత్యం, ఎండీ సాజిద్, మాజీ కౌన్సిలర్ రవినాయక్, చిలుముల లక్ష్మీనర్సింహ, దైద పద్మారెడ్డి, బూర సైదులు, కోమల హరి, ఇస్మాయిల్, మన్సూర్ ఖాదర్, చేతక్‌బాబా, చల్ల శ్రీను, సాంబయ్య, చంద్రచారి, మల్సూర్‌అలీ, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

మాడ్గులపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓట్ల తొలగింపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఆ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఎన్నికలసంఘాన్ని అడ్డుపెట్టుకుని బిహార్ రాష్ట్రంలోని ఓటర్ జాబితాలో లక్షలాది ఓట్లను తొలగించిందని, ఎన్నికల సంఘం కేంద్రానికి ఏజెంట్‌లా పనిచేస్తుందని ఆరోపించారు. కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోకపోతే భవిష్యత్తులో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, బొంగర్ల వెంకటయ్య, జోకూరు నాగయ్య, అలుగుబెల్లి నర్సిరెడ్డి, మేడి రవి, బొంగర్ల ఎల్లయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల సంబురం



మొల్కపట్నంలో శివసత్తుల విన్యాసాల నడుమ బోనాలతో వెళ్తున్న మహిళలు

వేములపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొల్కపట్నం, సల్కునూరు గ్రామాల్లో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనం ఎత్తు శివసత్తుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు సమర్పించారు. పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా తమను చల్లగా చూడాలని భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో మొలకలు ఎత్తుకున్న మహిళలు

కొండమల్లేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్ర్యతండాలో గురువారం తీజ్ వేడుకలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు మొలకలను నెత్తిన పెట్టుకొని గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో రమావత్ దస్రూనాయక్, మాడ్గుల యాదగిరి, రమావత్ భాస్కర్‌నాయక్, తండావాసులు పాల్గొన్నారు.

హైవేపై పోలీసుల తనిఖీలు

చింతపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు సందర్భంగా మండలంలోని గొడకొండ్ల చెక్‌పోస్టు సమీపంలో వాహనాలను గురువారం ఎస్ఐ రాంమూర్తి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ మేరకు సాగర్-హైదరాబాద్ ప్రధా న రాష్ట్ర రహదారిపై వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం అనుమతి పత్రాలు లేకుండా వాహనం నడపడం చట్ట పరమైన నేరమన్నారు.

అఖిలేష్‌యాదవ్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో బీజేపీ సీనియర్ నేత నక్క వెంకటేష్‌యాదవ్ తన కుమారుడి జ్ఞాపకార్థం అఖిలేష్ యాదవ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవలు కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. నక్క వెంకటేష్‌యాదవ్ తన వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన అఖిలేష్‌యాదవ్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. వేర్వేరుగా వారు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైద్యవృత్తిలో రాణించి ఎందరికో సేవలు అందించాల్సిన అఖిలేష్‌యాదవ్ అకాల మృతి బాధాకరమన్నారు. ఈ సందర్భంగా నిరుపేదలు వంద మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి, నక్క అన్వేష్‌యాదవ్, అనూష, ఆలంపల్లి నర్సిం హ, జాన్‌యాదవ్, ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ పాల్గొన్నారు.

మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవర్ధన్



మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆరున్నరేళ్ల తరువాత జరిగిన మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. మెడికల్ వ్యాపారులు రెండు వర్గాలుగా విడిపోయి నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఓటింగ్ నిర్వహించారు. మిర్యాలగూడ మెడికల్ అసోసియేషన్‌లో 309 మంది సభ్యులుండగా, ఓటింగ్ ప్రక్రియలో 300మంది సభ్యులు పాల్గొన్నారు. గెలుపు కోసం ఇరువర్గాలు పోటీపడి ప్రచారం చేశాయి. అసోసియేషన్ పాలకవర్గం కోసం బరిలో నిలిచిన కొంపల్లి గోవర్ధన్, పాలపర్తి కృష్ణారెడ్డి వర్గాల మధ్య తీవ్రస్థాయి పోటీతత్వం కొనసాగింది. బుధవారం సాయంత్రం జరిగిన ఓట్ల లెక్కింపులో గోవర్ధన్ ప్యానల్‌కు 150ఓట్లు దక్కగా, కృష్ణారెడ్డి ప్యానల్‌కు 149 ఓట్లు పోలుకాగా, ఒక ఓటు మురిగిపోయింది. దీంతో గోవర్ధన్ ప్యానల్ గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. గెలుపును సవాల్ చేస్తూ కృష్ణారెడ్డి ప్యానల్ రీ కౌటింగ్‌కు డిమాండ్ చేయడంతో బుధవారం అర్ధరాత్రి వరకు రీ కౌంటింగ్ నిర్వహించి చివరకు ఒక్క ఓటు మెజార్టీతో గోవర్ధన్ ప్యానల్ విజయాన్ని ఖరారు చేశారు. దీంతో మిర్యాలగూడ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడోసారి కొంపల్లి గోవర్ధన్ ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా చిదురాల శ్రీనివాస్, కోశాధికారిగా నల్లమెట్ల నరేష్ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రషీద్ ఎన్నికయ్యారు.

అలా కానిచ్చేశారు!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం మళ్లీ ఈ కేసును కదలించడంతో బిల్లులు చెల్లించిన జిల్లా అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది.

చెల్లింపుపై గోప్యత

గొర్రెల కొనుగోలు సక్రమంగానే జరిగాయని, అందుకే బిల్లులు చెల్లించామని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. సుమారు రెండేళ్ల పాటు బిల్లులను పెండింగ్‌లో ఉంచిన యంత్రాంగం వాటిని ఎలా చెల్లించే సాహసం చేసిందనేది చర్చనీయాంశమైంది. 1,172 నకిలీ ఇన్‌వాయిస్‌లు ఉండటం, 90కి పైగా రిసైక్లింగ్ కేసులు ఉన్న సమయంలో దళారుల వద్ద నుంచే గొర్రెలను కొనుగోలు చేశారని ఈడీకి సైతం నివేదిక అందజేసిన అధికారులే ప్రస్తుతం స్కాం లేదంటూ రూ .6 కోట్ల బిల్లును చెల్లించడం గమనార్హం. జిల్లా అధికారులు ఈ బిల్లులు చెల్లించినట్లు ఉన్నతాధికారులకు సమాచారం చేరినట్లు తెలిసింది. అదేవిధంగా ఈ నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో 'గొర్రెల స్కామా..అదెక్కడ?' శీర్షికన కథనం ప్రచురితం కాగా, దీనిపై సైతం ఉన్నతాధికారులు ఆరా తీసి, నివేదిక కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అక్రమాలు జరిగాయని అప్పట్లో అధికారులు నివేదిక ఇస్తే ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు బిల్లులు ఎలా చెల్లించారనే దానిపై విచారణ నిర్వహించే అవకాశం ఉంది. అయితే బిల్లుల చెల్లింపుపై గోప్యత పాటిస్తున్న అధికారులు దీన్ని కప్పిపుచ్చుకునేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : వార్ -2 , వెంకటేశ్వర: టు ఫ్రమ్ సో / రాఘవ: కూలీ, విట్రోస్: కూలీ, వార్-2, కింగ్ డమ్ దేవరకొండ : మనోజ్ : కింగ్‌డమ్ మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ